# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ బుధవారం 10 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## సోనియా గాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో



ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీకి నోటీసులు జారీ చేసింది. ప్రత్యేక జడ్జి విశాల్ మంగళవారం ఈ నోటీసులను జారీ చేస్తూ, ఆమెపై వచ్చిన ఆరోపణలకు సమాధానం కోరారు. అలాగే ఢిల్లీ పోలీసులను కూడా సమన్లు పంపించారు. వికాస్ త్రిపాఠి అనే వ్యక్తి కోర్టును ఆశ్రయిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌లోసోనియా గాంధీకి భారత పౌరసత్వం 1983లో లభించినప్పటికీ, దీని కంటే మూడు సంవత్సరాల ముందే, అంటే 1980లో ఆమె ఢిల్లీలో ఓటర్‌గా పేరు నమోదు చేసుకుందని ఆరోపించారు. ఇది మోసం, నకిలీ పత్రాల వినియోగం కిందకు వస్తుందని పిటిషనర్ పేర్కొన్నారు. పిటిషన్‌పై స్పందించాలని ఆదేశించిన కోర్టు, తదుపరి విచారణలో సోనియా గాంధీ మరియు ఢిల్లీ పోలీసుల నుండి వివరణను కోరింది.

## ప్రయాణికుల అసౌకర్యం సహించం



- విమాన సర్వీసుల్లో అంతరాయం వచ్చినపుడు బాధ్యత యాజమాన్యానిదే
- ఇండిగో సంక్షోభంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో


దేశవ్యాప్తంగా గత వారం రోజులుగా చోటుచేసుకున్న ఇండిగో విమాన సేవల అంతరాయాలపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు లోక్‌సభలో కీలక ప్రకటన చేశారు. ఎంత పెద్ద విమానయాన సంస్థ అయినా ప్రయాణికులకు అసౌకర్యం కలిగిస్తే సహించరని, ఇందుకు ఇండిగో సంస్థ సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఇండిగోలో రోస్టరింగ్ సమస్య కారణంగా విస్తృతంగా విమానాలు రద్దు కావడంతో వేలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడిన విషయం తెలిసినదే. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణకు ఇప్పటికే ఆదేశించామని, ఇండిగో సీఈవో, సీఓవోలకు షోకాజు నోటీసులు జారీ చేసినట్లు వెల్లడించారు.

విమాన సర్వీసులు క్రమంగా సాధారణ స్థితికి చేరుతున్నట్లు మంత్రి తెలిపారు. డిసెంబర్ 5న కేవలం 706 విమాన సర్వీసులు మాత్రమే నడిచగా, ప్రస్తుతం దాదాపు 1,800 సర్వీసులు నడుస్తున్నాయని వివరించారు. ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేస్తూ "సర్వీసుల్లో అంతరాయం వచ్చినపుడు బాధ్యత యాజమాన్యానిదే. ప్రయాణికుల భద్రత, సౌకర్యం కోసం దీర్ఘకాలిక చర్యలు తీసుకుంటున్నాం" అని మంత్రి అన్నారు.

ఇండిగో విమానాల రద్దు నేపథ్యంలో డీజీసీఏ సంస్థ శీతాకాల ఫ్లైట్ షెడ్యూల్‌లో 5 శాతం కోత విధించినట్లు మంత్రి తెలిపారు. అధిక డిమాండ్ మార్గాల్లో సర్వీసులు తగ్గించాల్సి వస్తుందని చెప్పారు. సవరించిన షెడ్యూల్‌ను నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఇండిగోకు ఆదేశాలు జారీ చేశాయని తెలిపారు. ఇండిగో ఇప్పటివరకు ప్రయాణికులకు రూ.750 కోట్లు రిఫండ్ చేసినట్లు ఆయన వెల్లడించారు. కొత్త విమాన నిబంధనలను పూర్తిగా పాటిస్తామని ఇండిగో హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఎన్నికల సంఘాన్ని కబ్జా చేసిన కేంద్రం

- ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ఎన్నికల సంస్కరణలపై జరిగిన చర్చలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కేంద్రమంత్రి మండలి, ముఖ్యంగా బీజేపీపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎన్నికల సంఘం (ఈసీ) స్వతంత్రత దిగజారిపోయిందని, కేంద్రం దానిని పూర్తిగా కబ్జా చేసిందని ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని వెల్లడించారు. రాహుల్ మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ భావజాలం దేశంలోని వ్యవస్థలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటోందని, వైవిధ్యాన్ని నాశనం చేస్తోందని విమర్శలు గుప్పించారు. "మహాత్మాగాంధీ హత్య తర్వాత దేశ చట్ట వ్యవస్థను స్వాధీనం చేసుకునే ప్రయత్నం ఆర్‌ఎస్‌ఎస్ ప్రారంభించింది" అని వ్యాఖ్యానించారు.

**ఈసీపై కేంద్రానికి రాహుల్ వేసిన మూడు ప్రశ్నలు**

ఎన్నికల స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది? దాని స్వతంత్రతను పునరుద్ధరించే చర్యలు తీసుకుంటారా?

ఓటర్ల జాబితా తారుమారుపై రాష్ట్రాల ఫిర్యాదులు పెరుగుతున్నాయి. వాటిని అరికట్టేందుకు ఏ చర్యలు?

ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి? పారదర్శక సంస్కరణలకు ప్రభుత్వం సిద్ధమా?

'దేశంలోని ఈసీ, ఈడీ, సీబీఐ వంటి కీలక సంస్థలు కేంద్ర అధీనంలోకి వెళ్లిపోయాయి. ఎన్నికల నిర్వహణ కూడా ప్రధాన మంత్రి మోదీ షెడ్యూల్‌ను అనుసరిస్తోంది" అని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల్లో భారీ అవకతవకలను బయటపెట్టామని పేర్కొన్నారు. పోలింగ్ అనంతరం 45 రోజులకు సీసీ కెమెరా ఫుటేజ్ ధ్వంసం చేయాలని కేంద్రం ఎందుకు నిర్ణయించిందో ప్రశ్నించారు. "హరియాణా ఓటర్ల జాబితాలో బ్రెజిల్ మోడల్‌కు 23 ఓట్లు ఉన్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది" అని వ్యాఖ్యానించారు. భారత ప్రజాస్వామ్యం 150 కోట్ల మంది ఓట్లతో అల్లుకున్న గొప్ప వ్యవస్థ అని రాహుల్ పేర్కొన్నారు. "ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలు ఉన్నప్పటికీ ఈసీ ఇప్పటి వరకు స్పందించలేదు. ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి ఈసీని బీజేపీ వాడుకుంటోంది. ఆ పథకం ప్రకారమే సీజేఐని ఈసీ ఎంపిక ప్యానల్ నుంచి తొలగించారు" అని ఎద్దేవా చేశారు.




# పేదల అభ్యున్నతే లక్ష్యంగా
# విజన్ డాక్యుమెంట్

- 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడం లక్ష్యం
- 2047 నాటికి దేశ జీడీపీలో రాష్ట్ర వాటా పదిశాతం
- తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ముగింపు సభలో సీఎం రేవంత్‌రెడ్డి
- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన డ్రోన్ షో... గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అట్టడుగు వర్గాలు, పేదల అభ్యున్నతినే ముఖ్య ఉద్దేశంగా 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్ రూపొందించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ప్రజలు ఆశించిన స్వేఛ్, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు అందిస్తూనే, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడం ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025 ముగింపు కార్యక్రమంలో 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేశారు. ఈ డాక్యుమెంట్ కాపీని రోబో వేదిక పైకి తీసుకురావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సభ ముగిసిన అనంతరం డ్రోన్ టెక్నాలజీ ద్వారా విజన్ డాక్యుమెంట్‌లోని అంశాలను వ్యూహాత్మక దృశ్యాలతో ఆకాశంలో ప్రదర్శించారు. ఆ షోకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటుదక్కింది.

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, విజన్ డాక్యుమెంట్ ఉద్దేశాలు మరియు లక్ష్యాలను వివరించారు. విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు ఆన్‌లైన్‌లో నాలుగు లక్షల మంది తమ విలువైన సలహాలు, సూచనలు రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారని తెలిపారు. తెలంగాణ మట్టికి గొప్ప చైతన్యం ఉందన్నారు. జల్, జంగిల్, జమీన్ నినాదంతో కొమురం భీం, ఆ తర్వాత భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం వేలాది మంది పోరాటాలు చేసిన గడ్డ అని చెప్పారు. ఆ స్ఫూర్తి నుంచే ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్ ప్రకటించారని వివరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఆశించిన, ప్రణాళికాబద్ధ అభివృద్ధి జరగలేదనీ, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం తెలంగాణ ప్రజలు ఆశతో ఎదురుచూడాల్సి వచ్చిందని చెప్పారు. 2047 నాటికి మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేండ్లు అవుతుందనీ, అప్పటివరకూ దేశాన్ని 30 ట్రిలియన్ డాలర్లతో ప్రపంచంలోనే నాలుగో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోడీ వికసిత్ భారత్ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశంలో 2.9 శాతం జనాభాగా ఉన్న తెలంగాణ రాష్ట్రం ఐదు శాతం జీడీపీని కాంట్రిబ్యూట్ చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్ ద్వారా పది శాతం డీజీపీని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని సీఎం ప్రకటించారు. మేధావులను, ఆర్థికనిపుణులను, వ్యాపారవేత్తలను, ప్రజలను భాగస్వామ్యం చేసి రూపొందించిన ఈ పాలసీని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అంకితం చేస్తున్నామని చెప్పారు. యువత, రైతులు, మహిళలకు ఈ పాలసీ ద్వారా ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు.గాంధీ సూచనల మేరకు

మిగితా 4వ పేజీలో

## కేసీఆర్ దీక్ష ఫలితమే డిసెంబర్ 9 ప్రకటన




- ప్రజల బతుకులు మార్చుతానంటూ తెలంగాణ తల్లిని మార్చిండు
- ట్రంప్ పేరుతో రోడ్డు ఏంటి
- మాజీమంత్రి హరీశ్‌రావు
- తెలంగాణ భవన్‌లో ఘనంగా విజయ్ దివస్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆవిర్భావానికి మార్గం సుగమం చేసిన చారిత్రక డిసెంబర్ 9 ప్రకటన కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష ఫలితమేనని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన ఆయన, కేసీఆర్ పోరాటాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి, అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు సమర్పించారు.

హరీశ్‌రావు మాట్లాడుతూ "నవంబర్ 29 లేకపోతే డిసెంబర్ 9 లేదు. డిసెంబర్ 9 లేకపోతే జూన్ 2 లేదు. ఈ మూడు తేదీలు తెలంగాణ చరిత్రలో మైలురాళ్లు. నిమ్స్‌లో కేసీఆర్ 11 రోజుల దీక్షే చిదంబరం అర్ధరాత్రి చేసిన ప్రకటనకు కారణం," అన్నారు. "కేసీఆర్ అంటే పోరాటం, త్యాగం. రేవంత్ అంటే వెన్నుపోటు, ద్రోహం. తెలంగాణ ఉద్యమ చరిత్ర రాసినా ఆయన స్థానమే ద్రోహం. జై తెలంగాణ అనేవారిపై తుపాకీ ఎత్తిన వ్యక్తి నేడు తెలంగాణ తల్లిని మార్చే ధైర్యం ఎలా చేస్తాడు?" అంటూ ప్రశ్నించారు. "ఎరువులు, విత్తనాల కొరత సృష్టించారు. రైతుబంధు, రైతుబీమా నిలిపేశారు. ధరలు పెరిగాయి. మహిళలకు భద్రత తగ్గింది. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారు," అని ఆరోపించారు. "రవీంద్రభారతి కంటే రామోజీ ఫిలింసిటీ గొప్పదంటారు. హైదరాబాద్‌లో ట్రంప్ పేరు రోడ్డు పెట్టడమా? అమెరికాలో మన పిల్లలను జైళ్లలో పెట్టిన ఆ వ్యక్తి పేరు నగరానికి పెడతారా?" అని మండిపడ్డారు. "నాడు సోనియాను బలి దేవత అన్న రేవంత్ నేడు ఆమెకు గుడి కడతానంటున్నాడు. తెలంగాణ ప్రకటించకుండా వెనక్కి తీసుకున్న రోజును తెలంగాణ విద్రోహ దినంగా గుర్తించాలి," అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

## పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల

**మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలు**

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరానికిగాను పదో తరగతి (ఎస్ఎస్‌సీ) వార్షిక పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. మార్చి 14వ తేదీ నుంచి ఏప్రిల్ 16వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నట్లు అధికారిక ప్రకటనలో పేర్కొంది.అన్ని సాధారణ అకాడమిక్ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు (పార్ట్-బి) రాయడానికి చివరి 30 నిమిషాల్లో మాత్రమే అవకాశం ఉంటుందని స్పష్టంచేశారు. ఫిజిక్స్, బయాలజీ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 నుంచి 11.00 గంటల వరకు మాత్రమే ఉంటాయి. ఈ రెండు పరీక్షల్లో పార్ట్-బి సమాధానాలు చివరి 15 నిమిషాల సమయంలో మాత్రమే రాయాల్సి ఉంటుందని విద్యాశాఖ తెలిపింది.



## గ్లోబల్ సమ్మిట్‌లో పోలీస్ స్టాల్

- సందర్శించిన డీజీపీ బత్తుల శివధర్ రెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం డ్రోన్లను వినియోగించనున్నామని రాష్ట్ర డీజీపీ బత్తుల శివధర్ రెడ్డి అన్నారు. మంగళవారం తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరుగుతున్న మీర్‌ఖాన్‌పేట్‌లో ఏర్పాటు చేసిన పోలీస్ స్టాల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు డ్రోన్ల ఉపయోగాలపై ఆయన ఆసక్తిగా పరిశీలన చేశారు. గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో సైతం 10 డ్రోన్లతో ట్రాఫిక్ నియంత్రణ, పరిసరాలపై నిఘాను పర్యవేక్షించడం జరిగిందని అధికారులు డీజీపీకి వివరించారు. వాటి పనితనాన్ని పరిశీలించిన డీజీపీ ఇకముందు రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల దర్యాప్తు, ట్రాఫిక్ నియంత్రణ విషయంలో డ్రోన్లను విరివిగా వినియోగించడానికి అవసరమైన అవకాశాలను అన్నింటినీ పరిశీలిస్తామని తెలిపారు. రాబోయే సమ్మక్క, సారక్క భారీ జాతరలో విచ్చేసే లక్షలాది మంది భక్తులను నియంత్రించే విషయంలోనూ, పరిసరాలపై నిఘా వేయడానికి డ్రోన్లను వినియోగిస్తామని ఆయన తెలిపారు. అలాగే నేరాలు జరిగినప్పుడు దర్యాప్తు అధికారులు ఆ ప్రాంతానికి చేరుకునేలోగా అక్కడి పరిస్థితులను, వాతావరణాన్ని వెంటనే అధికారులకు తెలియజేసేలా డ్రోన్లను వినియోగిస్తామని ఆయన తెలిపారు. మొత్తానికి పోలీస్ శాఖ విధుల్లో డ్రోన్ల ఉపయోగం భవిష్యత్తులో మరింత కీలకం కానున్నాయని శవధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కాగా పోలీస్ శాఖ స్టాల్ ను పరిశీలించాక ఆయన అదే ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీస్ కమాండ్ కంట్రోల్ ను సందర్శించారు. అక్కడ గ్లోబల్ సమ్మిట్‌కు ఏర్పాటు చేసిన బందోబస్తును సీసీ కెమెరాల ద్వారా ఆయన పరిశీలించారు. ముఖ్యంగా డ్రోన్ కెమెరాల నుంచి కమాండ్ కంట్రోల్‌కు ఏ విధంగా సమాచారం అందుతున్నది ఆయన పరిశీలించారు. మొత్తం 6 వేల మంది పోలీసులతో ఏర్పాటు చేసిన బందోబస్తు వివరాలను అధికారుల నుంచి డీజీపీ తెలుసుకున్నారు. కాగా, ఇటీవలనే రిక్రూట్ అయిన 115 మంది ప్రొబేషనరీ డీఎస్పీలను బందోబస్తులో వినియోగిస్తున్న తీరును కూడా ఆయన అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విదేశీ ప్రతినిధులకు లైజన్ అధికారులుగా 30 మంది ప్రొబేషనరీ డీఎస్పీలను నియమించడాన్ని ఆయన అభినందించారు.

## రికార్డు స్థాయిలో పెట్టుబడులు



- రెండో రోజూ రూ.2.96 లక్షల కోట్లు
- మొత్తం రూ.5.75లక్షల కోట్ల హామీలు
- ఫుడ్ ప్రాసెసింగ్, డెటా సెంటర్లకు ఆసక్తి
- ఫార్మా, క్లీన్ ఎనర్జీ రంగాల్లో భారీ ప్రాజెక్టులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ కొనసాగింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో మంగళవారం నాడు వివిధ కంపెనీల ప్రతినిధులు భారీగా పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారు. భారత్ ఫ్యూచర్ సిటీలో రెండో రోజూ జరిగిన సమ్మిట్‌లోనూ దిగ్గజ పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒప్పందాలు కుదుర్చుకున్నారు. మంగళవారం రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం మొత్తంగా రూ.5.75 లక్షల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలు జరిగాయి. రెండో రోజంతా పెట్టుబడుల జాతర కొనసాగింది. తొలి రోజు రూ.2.43 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగిన విషయం తెలిసిందే. రెండో రోజు రూ. 3.32 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్టుబడులు, ఉద్యోగాల పెంపునకు వచ్చిన భారీ ప్రాజెక్టులు ఎంతో ఉపయోగపడను న్నాయని అధికార వర్గాలు తెలిపాయి. ముఖ్యంగా ఫుడ్ ప్రాసెసింగ్, డేటా సెంటర్లు, ఔషధ రంగం, క్లీన్ ఎనర్జీ, ఎలక్ట్రానిక్స్ వంటి విభాగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులతో పాటు ఉద్యోగాలు వెల్లడించాయి.

ఇన్‌ఫ్రాకీ డాటా సెంటర్ పార్క్స్ 150 ఎకరాల్లో 1 గిగావాట్ సామర్థ్యం గల భారీ డేటా పార్క్ అభివృద్ధి చేపట్టేందుకు రూ.70 వేల కోట్ల పెట్టుబడులతో ముందుకొచ్చింది. జెసీకే ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్

మిగితా 4వ పేజీలో

## భారత్ ఫ్యూచర్ సిటీతో లక్షల ఉద్యోగాలు

- మంత్రి శ్రీధర్ బాబు



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించే ప్రపంచస్థాయి నగరంగా రూపుదిద్దుకోనున్న భారత్ ఫ్యూచర్ సిటీతో సుమారు 13 లక్షల మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు వెల్లడించారు. తాను మంగళవారం తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొని 'భారత్ ఫ్యూచర్ సిటీ యాజ్ ఎ మ్యాగ్నెట్ ఫర్ 3 ట్రిలియన్ డాలర్స్ తెలంగాణ' అనే అంశంపై ప్రభుత్వ ప్రణాళికలను వివరించారు.


13,500 ఎకరాల్లో అభివృద్ధి కానున్న ఈ నగరం సుమారు 9 లక్షల జనాభాకు ఆవాసంగా మారబోతోందన్నారు. మొత్తం నగరాన్ని ఆరు అర్బన్ జిల్లాలుగా విభజించి విభిన్న రంగాల కేంద్రాలుగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. వచ్చే ఫిబ్రవరి చివరినాటికి నిర్మాణాలు ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు.

భారత్ ఫ్యూచర్ సిటీ పూర్తిగా జీరో కార్బన్ నగరంగా రూపుదిద్దుకోనున్నదని శ్రీధర్ బాబు తెలిపారు. అర్బన్ ఫారెస్టులతో పచ్చదనం నిండిన వాతావరణం, భవిష్యత్ అవసరాలకు సరిపోయే ఆధునిక రవాణా వ్యవస్థ, ప్రతి వర్షపు చుక్కను నిల్వ చేసే రెయిన్ హార్వెస్టింగ్ వ్యవస్థ వంటి లక్షణాలు ఈ నగరాన్ని ప్రత్యేకంగా నిలబెడతాయని చెప్పారు.సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ నగరం ప్రపంచ ప్రఖ్యాతిని

మిగితా 4వ పేజీలో

## జీపీ మొదటి ఫేజ్ ఎన్నికలకు సన్నద్ధం..

- 76 జీపీలు, 521 వార్డుల్లో ఎన్నికలు
- 18 రకాల గుర్తింపు కార్డులతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చు




బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి అవుతున్నాయి. ఈ నెల 11వ తేదీన బుధవారం 76 గ్రామ పంచాయతీలు, 521 వార్డుల్లో ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సన్నద్ధమైంది.

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని చందుర్తి, కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్నారు. చందుర్తి మండలంలో 13,445 మంది పురుషులు, 14,649 మహిళలు మొత్తం 28,094, కోనరావుపేట మండలంలో 17,180 మంది పురుషులు, 18,045 మహిళలు మొత్తం 35,225, రుద్రంగి మండలంలో 6,454 మంది పురుషులు, 7,208 మహిళలు, ఇతరులు ముగ్గురు.. మొత్తం 13,665, వేములవాడ అర్బన్ మండలంలో 8,953 మంది పురుషులు, 9,523 మహిళలు, ఇతరులు 16 మంది కలిసి మొత్తం 18,492, వేములవాడ రూరల్ మండలంలో 9,020 మంది పురుషులు, 9,805 మహిళలు మొత్తం 18,825 ఓటర్లు ఉన్నారు.

**మొత్తం పోలింగ్ కేంద్రాలు**

మొదటి ఫేజ్ ఎన్నికలలో భాగంగా కోనరావుపేట, రుద్రంగి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్ మండలాల్లోని మొత్తం 76 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు, 521 వార్డుల్లో 521 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పోలింగ్ కోసం అన్ని

మిగితా 4వ పేజీలో

# ఏసీబీకి చిక్కిన కల్వకుర్తి ఏడీఈ

**బలగం టీవీ,నాగర్‌కర్నూల్**



అవినీతి కార్యకలాపాలకు పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులపై ఏసీబీ పంజా విసురుతోంది. బాధితుల ఫిర్యాదులపై వెంటనే చర్యలకు దిగుతున్న అధికారులు, లంచం తీసుకుంటున్న అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా అరెస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి సబ్‌డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌గా (ఏడీఈ) పనిచేస్తున్న ఎద్దుల వెంకటేశ్వర్లు మంగళవారం లంచం స్వీకరిస్తూ పట్టుబడ్డారు. వెల్దండ మండలం చొక్కన్నపల్లి గ్రామానికి చెందిన వ్యక్తి ఇంటి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు, తన పేరుపై మీటర్ మంజూరు చేయాల్సిందిగా ఏడీఈని సంప్రదించినట్టు సమాచారం. ఈ పనుల కోసం రూ.20 వేల లంచం డిమాండ్ చేసిన ఏడీఈ, ఫిర్యాదుదారుని నుంచి రూ.15 వేల లంచం తీసుకుంటున్నప్పుడు ఏసీబీ అధికారులు దాడి చేసి రంగేహస్తంగా అరెస్టు చేశారు. అనంతరం ఆయనపై కేసు నమోదు చేసి, హైదరాబాద్ ఏసీబీ కోర్టులో హాజరుపర్చినట్లు అధికారులు వెల్లడించారు.

# మనస్తాపంతో రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆత్మహత్య

- **కుషాయిగూడలో ఘటన**

**బలగం టీవీ, హైదరాబాద్**



వ్యక్తిగత సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ స్థిరాస్తి వ్యాపారి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కాప్రా సర్కిల్, కందిగూడలోని ఆర్‌కే ఎంక్లేవ్‌లో నివసిస్తున్న శ్రవణ్ అలియాస్ లల్లు (36) స్థిరాస్తి వ్యాపారిగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య ప్రియ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గతంలో స్థానికంగా జరిగిన రెండు హత్య కేసుల్లో శ్రవణ్ ప్రధాన నిందితుడిగా ఉండగా, ప్రస్తుతం న్యాయస్థానాలలో పలు కేసుల్లో విచారణను ఎదుర్కొంటున్నట్లు పోలీసులు వెల్లడించారు. వ్యక్తిగత కారణాలు, స్థిరాస్తి వ్యాపారంలో పెరిగిన ఆర్థిక ఇబ్బందుల కారణంగా శ్రవణ్ తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో, తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రవణ్‌ను ఉరివేసుకుని ఉన్న స్థితిలో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించిన పోలీసులు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు.

# శంషాబాద్ విమానాశ్రయానికి బాంబు బెదిరింపు

- **ఒకే రోజు రెండు ఈ మెయిల్స్‌తో కలకలం.. అప్రమత్తమైన అధికారులు**

**బలగం టీవీ, హైదరాబాద్**

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వరుసగా వస్తున్న బాంబు బెదిరింపు ఇమెయిల్స్ తీవ్ర కలకలం రేపుతున్నాయి. మంగళవారం రోజునే రెండు సార్లు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో ఎయిర్‌పోర్టు అధికారులు హైఅలర్ట్ ప్రకటించి విస్తృత తనిఖీలు చేపట్టారు. విమానాశ్రయ అధికారుల వెల్లడించిన వివరాల ప్రకారం గుర్తు తెలియని వ్యక్తులు ఒక మిలియన్ డాలర్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ, ఇవ్వకపోతే ఎయిర్‌పోర్టులో కాల్పులు జరిపి, బాంబులు పేల్చేస్తామని బెదిరింపులు చేసినట్లు వెల్లడించారు. అంతేకాకుండా అమెరికాకు వెళ్లే విమానాన్ని హైజాక్ చేసి బెంగళూరులో కూల్చివేస్తామని కూడా మెయిల్‌లో హెచ్చరించారు. ఈ బెదిరింపు మెయిల్ editor@epochtimes.cpm, ఫోన్ నెంబర్ +1-2016143989 నుంచి వచ్చినట్లు అధికారులు గుర్తించారు.

ఇదిలా ఉండగా, ఉదయం కూడా శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఇదే తరహాలో బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అమెరికా న్యూయార్క్‌కు చెందిన జాస్పర్ పకార్డ్ పేరుతో పంపబడిన ఈ మెయిల్‌లో, శంషాబాద్ నుంచి అమెరికాకు వెళ్లే విమానాల్లో బాంబులు పెట్టినట్టు, టేకాఫ్ అయిన పది నిమిషాల్లో పేల్చేస్తానంటూ హెచ్చరించారు. బాంబు పేలకుండా ఉండాలంటే ఒక మిలియన్ డాలర్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. వెంటనే అప్రమత్తమైన ఎయిర్‌పోర్టు సిబ్బంది అన్ని టెర్మినల్స్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అయితే తక్కువ వ్యవధిలోనే రెండోసారి వచ్చిన బెదిరింపు మెయిల్ వల్ల భద్రతా విభాగం మరింత పటిష్ఠంగా తనిఖీలు చేపట్టింది. ఘటనల నేపథ్యంలో శంషాబాద్ విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో కూడా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీంకోర్టులో విచారణ వాయిదా

- **మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం పిటిషన్**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్‌రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు మంగళవారం బుధవారానికి వాయిదా వేసింది. ధర్మాసనం ముందుకు వచ్చిన ఈ పిటిషన్‌పై ఈరోజే వాదనలు జరగాల్సి ఉన్నప్పటికీ, ప్రభాకర్‌రావు తరపు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో మరోసారి విచారణ వాయిదాకి గురైంది. ఇంతకుముందు ఈ పిటిషన్‌పై నవంబర్ 18న వాదనలు జరగాల్సి ఉండగా అదే కారణంతో విచారణను మంగళవారానికి తరలించారు. ప్రభుత్వం తరపు న్యాయవాదులు తమ వాదనల్లో, కేసుకు సంబంధించిన కీలక డిజిటల్ ఆధారాలను ప్రభాకర్‌రావు ధ్వంసం చేశారని సుప్రీంకోర్టుకు వివరించారు. ఐక్లౌడ్ పాస్‌వర్డ్ ఇవ్వకుండా విచారణను అడ్డుకుంటున్నారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో, ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌ను రీసెట్ చేయాలని గత విచారణలో సుప్రీంకోర్టు ప్రభాకర్‌రావుకు ఆదేశించిన విషయం తెలిసిందే.

# ప్రజల ఆకాంక్షలకే ప్రజా ప్రభుత్వ ప్రేరణ

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్‌లలో తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్‌గా ఆవిష్కరించిన సీఎం రేవంత్ రెడ్డి**
- **గ్లోబల్ సమ్మిట్ వేదికగా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ**




**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల కలెక్టరేట్ల ఆవరణలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాలను వర్చువల్‌గా ఆవిష్కరించారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ -2025 జరుగుతున్న భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా ఏర్పాటు చేసిన కార్యక్రమం నుంచి తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించారు.రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఇతర మంత్రివర్గ సహచరుల సమక్షంలో గ్లోబల్ సమ్మిట్ వేదికగా జరుపుకోవడం శుభ పరిణామమని ముఖ్యమంత్రి అన్నారు. ప్రజలు గ్లోబల్ సమ్మిట్‌కు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు, దేశ పారిశ్రామిక వేత్తలకు ఈ సందర్భంగా తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

ఈ ఆవిష్కరణ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. "ప్రజల ఆలోచనలను, దళితులు, గిరిజనులు, ఆదివాసీలు, మైనారిటీల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రతినిత్యం తెలంగాణ తల్లిని స్ఫూర్తిగా తీసుకుని, ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడంలో ఒక బలమైన సంకల్పంతో నిర్ణయం తీసుకుని ఈ ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టింది. యూపీఏ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆధ్వర్యంలో ఆనాటి ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం 9 డిసెంబర్ 2009న తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని ప్రకటన చేసిన మంచి రోజు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను ప్రతిబింబిస్తూ తీసుకున్న ఆ నిర్ణయం ఈ ప్రాంత ప్రజలకు సంతోషాన్ని ఇవ్వడమే కాకుండా ఆత్మగౌరవాన్ని అందించాయి.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డిసెంబర్ 9 కి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి 60 సంవత్సరాల ప్రజల బలమైన ఆకాంక్షను నెరవేర్చిన పర్వదినాన్ని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించి, ప్రతి ఏటా డిసెంబర్ 9 తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలను జరుపుకుంటున్నాం. గతేడాది రాష్ట్ర పరిపాలన కేంద్రమైన సచివాలయంలో ఆవిష్కరించుకుని ఒక స్ఫూర్తిని తీసుకొచ్చాం. ఈరోజు అన్ని జిల్లా కలెక్టరేట్లలో ఆవిష్కరించుకున్నాం. స్వరాష్ట్ర కల నిజమై, తెలంగాణ రాష్ట్రం ఇప్పుడు నిటారుగా నిలబడి సంక్షేమం, అభివృద్ధిలో దేశంలోనే నెంబర్ 1 రాష్ట్రంగా తీర్చిదిద్దుకుంటున్నది.." అని ముఖ్యమంత్రి అన్నారు.

# పోలింగ్ రోజే ఏపీపీ పరీక్ష నిర్వహించడం సరికాదు

- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు**
- **ఎమ్మెల్యేకు న్యాయవాదుల బృందం వినతిపత్రం**

**బలగం టీవీ, హైదరాబాద్**



గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ జరిగే రోజునే అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) రాత పరీక్షను నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించడం సరికాదని మాజీ మంత్రి హరీశ్ రావు ఆక్షేపించారు. పరీక్షను వెంటనే వాయిదా వేయాలని ఆయన డిమాండ్ చేశారు. మంగళవారం హైకోర్టు సీనియర్ న్యాయవాది శివశేఖర్ ఆధ్వర్యంలోని న్యాయవాదుల బృందం హరీశ్‌రావును కలిసి వినతి పత్రం సమర్పించింది. డిసెంబర్ 14న జరగనున్న ఏపీపీ పరీక్షను వాయిదా వేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని వారు కోరారు.

ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ రాష్ట్రంలో 118 ఏపీపీ పోస్టుల భర్తీకి సంబంధించి డిసెంబర్ 14న రాత పరీక్ష నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని, అదే రోజున గ్రామ పంచాయతీ ఎన్నికల రెండో విడత పోలింగ్ ఉంటుందని గుర్తు చేశారు. హైదరాబాద్‌లో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాలకు హాజరయ్యే దాదాపు నలుగురు వేల మంది న్యాయవాదుల ఓటర్లు తమ తమ గ్రామాల్లో ఉండటంతో, ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష ఉండటం వలన ఓటుహక్కు వినియోగించడం అసాధ్యమవుతుందని తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ప్రతి పౌరుడికి ఉండాలని, పరీక్ష పేరుతో న్యాయవాదులను ఓటింగ్‌కు దూరం చేయడం అన్యాయమని హరీశ్ రావు పేర్కొన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి, డిసెంబర్ 14న జరగాల్సిన ఏపీపీ పరీక్షను మరో తేదీకి మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. న్యాయవాదులకు ఎలాంటి నష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

# అక్రమ మద్యం పట్టుకున్న పోలీసులు..

- **1,33,000/- రూపాయల విలువ గల మద్యం, ఒక కార్ సీజ్.. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు..**
- **పంచాయతీ ఎన్నికల సందర్భంగా అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే చర్యలు తప్పవు**
- **ఎస్.ఐ రమాకాంత్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**



బోయినిపల్లి ఎస్.ఐ రమాకాంత్ మాట్లాడుతూ.. స్థంభంపల్లి గ్రామానికి చెందిన సంతోష్ మరియు సుమన్ అనే ఇద్దరు వ్యక్తులు సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో వేములవాడ పట్టణ పరిధిలోని నంది కమాన్ వద్ద గల వైన్స్ నుండి మద్యం కొనుగోలు చేసి స్థంభంపల్లి గ్రామానికి తరలిస్తున్నారన్న సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం మరియు బోయినపల్లి పోలీసులు దాడులు నిర్వహించగా వారి వద్ద 1,33,000/- రూపాయల 253 లీటర్ల మద్యం లభించింది,ఎన్నికల నియవళి ఉల్లగించిన నేపథ్యంలో అట్టి మద్యం, వారు తరలిస్తున్న కార్ సీజ్ చేసి వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం కేసు నమోదు చేయడం జరిగిందని బోయినపల్లి ఎస్.ఐ రమాకాంత్ తెలిపారు. సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం, డబ్బు రవాణాకు పాల్పడితే నియమావళి ప్రకారం చర్యలు తప్పవి ఈ సందర్భంగా ఎస్.ఐ హెచ్చరించారు.

# ఇంటి పన్ను వసూలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి



- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వివిధ అంశాలపై సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి పన్ను వసూలు ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇంటి, నీటి పన్ను వసూలు, ట్రేడ్ లైసెన్స్, తడి, పొడి చెత్త సేకరణ, వివిధ అభివృద్ధి పనుల పురోగతి, సిబ్బంది, వాహనాల అంశాలపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలో ఇప్పటిదాకా ఇంటి, నీటి పన్ను వసూలుపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బందితో ఒక ప్రణాళిక ప్రకారం వసూలు చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో తడి, పొడి చెత్త సేకరణ, ఎన్ని ట్రాక్టర్లు, ఆటోలు ఉన్నాయి? సెగ్రిగేషన్ చేసే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ప్రారంభించిన రోడ్లు, మురుగుకాలువలు, జంక్షన్ల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో షెటర్ల వివరాలపై ఆరా తీశారు. ట్రేడ్ లైసెన్స్, మెప్మా పరిధిలో మహిళా సంఘాల పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, అన్వేష్, డీటీసీపీఓ అన్సార్, డీఈలు, టీపీవోలు తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ రోజున పబ్లిక్ హాలిడే



- ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలో గ్రామ పంచాయితీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్న నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ఆయా కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజున విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవులు ప్రకటించినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ నెల 11 న మొదటి విడత, 14 న రెండవ విడత, 17 న మూడవ విడత ఎన్నికల నిర్వహణ ఉన్నందున రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ నిర్వహించే కేంద్రాల్లో ముందు రోజు అలాగే పోలింగ్ రోజు జిల్లాలోని విద్యాసంస్థలు, పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రభుత్వ కార్యాలయాలకు స్థానిక సెలవులు ఉంటాయని పేర్కొన్నారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం 10.12.2025(బుధవారం) %డ% 11.12.2025 (గురువారం) స్థానిక సెలవులు, రెండవ విడత ఎన్నికల నిర్వహణ కోసం 13.12.2025 (రెండవ శనివారం), 14.12.2025 (ఆదివారం) సాధారణ సెలవులు, మూడవ విడత ఎన్నికల నిర్వహణ కోసం 16.12.2025 (మంగళవారం), 17.12.2025 (బుధవారం) స్థానిక సెలవులు ప్రకటించారు. చట్ట ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ రోజున సెలవు వర్తిస్తుందని ఇంచార్జి కలెక్టర్ పేర్కొన్నారు.

# గర్భిణుల సంరక్షణపై దృష్టి సారించాలి..

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అధ్యక్షతన మంగళవారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా నోడల్ సూపర్వైజర్ల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా, డాక్టర్ రజిత ఆశా సూపర్వైజర్లకు పలు కీలక సూచనలు చేశారు. గర్భిణీ స్త్రీల నమోదును సరిగ్గా నిర్వహించాలని, అలాగే హై రిస్క్ గర్భిణీ స్త్రీలను త్వరగా గుర్తించి, వారికి రక్తహీనత లేకుండా ఎప్పటికప్పుడు చెక్-అప్‌లు చేయించాలని ఆదేశించారు. సాధారణ ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే జరిగేలా గర్భిణీ స్త్రీలను ప్రోత్సహించాలని చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని, లేనియెడల సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంహెచ్ఎన్ డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ అనిత, డాక్టర్ నహిమ, డెమో రాజకుమార్, సిహెచ్ఓ శాంత, బాలచంద్రం లు పాల్గొన్నారు.

# మొదటి విడత ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం..

- 700 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..
- పోలీస్ అధికారులు, సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి..
- జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే తెలిపారు.ఎన్నికల విధుల్లో భాగంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ ఎన్నికల విధులకు సంబంధించి విధులపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో పటిష్టమైన ప్రణాళికతో ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా మొదటి విడత ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్ శాఖ పరంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. శాంతి యుత వాతవారణంలో మొదటి విడత ఎన్నికలు నిర్వహించడానికి రూట్ మొబైల్స్క్మ25, జోనల్ టీమ్స్ ఇన్స్పెక్టర్ స్థాయి అధికారితో 07, క్విక్ రియాక్షన్ టీమ్స్ 05, స్ట్రయికింగ్ ఫోర్స్ 02 ఏర్పాటు చేసి మొత్తంగా 700 మంది పోలీస్ సిబ్బందిని వినియోగిస్తున్నామని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది పోలింగ్ కేంద్రాన్ని పోలింగ్ సమయంలో, కౌంటింగ్ సమయంలో ఎట్టి పరిస్థితులలోనూ వదిలి వెళ్లవద్దని, రూట్ మొబైల్ అధికారులు తరచు తనకు కేటాయించిన రూట్లలలో పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద, రూట్ లలో పోలింగ్ ప్రశాంత వాతావరణానికి భంగం కలిగే ఏ చిన్న సంఘటన ఎదురైన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఎన్నికల విధులలో ఉన్న సిబ్బంది ఓటు హక్కును వినియోగించుకోవడానికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా ఉండాలని, అనవసర విషయాలు చర్చించవద్దన్నారు. ఓటర్లు ఎవ్వరూ కూడా సెల్ ఫోన్ లు, మందుగుండు సామాగ్రి, ఇంక్ బాటిల్స్, వాటర్ బాటిల్స్, పోలింగ్ బూతులోనికి తీసుకువెళ్లారాదని, సెల్ఫీలు దిగడం నిషేదం అన్నారు. జిల్లా ప్రజలు పోలీసులకు సహకరిస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశించిన ఎన్నికలు నియమావళి పాటిస్తూ స్వేచ్ఛాయుత వాతావరణం లో ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎస్పీ కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు ఎవరైనా పాల్పడిన, ఎన్నికల నియమావళి ప్రకారం చట్ట రీత్యా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు, ఎస్.ఐ లు,సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్

- హాజరైన జిల్లా అధికారులు, సిబ్బంది

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రోడ్స్ అండ్ బిల్డింగ్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గడ్డం నగేష్ ఆవిష్కరించారు. విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కాగా, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ పాటిస్తూ అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బీ ఈఈ నరసింహాచారి, సీపీఓ శ్రీనివాసాచారి, డోర్స్ అధ్యక్షుడు డీవీ హెచ్ ఓ రవీందర్ రెడ్డి, ఏవో రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**బలగం టీవీ, వేములవాడ**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో మొదటి ఫేజ్ ఎన్నికలు నిర్వహించనున్న పలు మండలాల్లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ మంగళవారం పరిశీలించారు. వేములవాడ రూరల్, వేములవాడ అర్బన్, చందుర్తి మండలాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్ ఏర్పాట్లను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బందికి అవసరమైన వసతులు కల్పించాలని సూచించారు. ఈ పరిశీలనలో తహసీల్దార్లు విజయ్ ప్రకాశ్ రావు, అబూ బాకర్, భూపతి, ఎంపీడీఓలు శ్రీనివాస్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నగదు, మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలి..

- రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే.
- రుద్రంగి మానాల చెక్ పోస్ట్ ఆకస్మిక తనిఖీ

**బలగం టీవీ, రుద్రంగి:**

రానున్న పోలింగ్ ప్రక్రియ సజావుగా జరిగేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే అక్రమ నగదు, మద్యం రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే అధికారులకు ఆదేశించారు. మంగళవారం రోజున జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే రుద్రంగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మానాల క్రాస్ రోడ్ వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్ పోస్టు నందు అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న వాహన తనిఖీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్ పోస్టు వద్ద పనిచేసే అధికారులు మరియు సిబ్బందికి ఎస్పీ పలు కీలక సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసి వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అత్యంత అప్రమత్తంగా ఉంటూ ఓటర్లను ప్రలోభ పెట్టే విధంగా జరిగే నగదు, మద్యం వంటి అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ అరికట్టాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా అధికారులు బాధ్యతగా వ్యవహారించాలని అన్నారు. జిల్లా ప్రజలందరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చందుర్తి సి.ఐ వెంకటేశ్వర్లు, ఎస్.ఐ శ్రీనివాస్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా సిరిసిల్ల చీర

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ లో నల్లా విజయ్ ప్రత్యేకంగా ప్రదర్శించిన అగ్గిపెట్టె లో ఇమిడి పోయే సిరిసిల్ల చీర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హ్యాండ్లూమ్, టెక్స్టైల్, హ్యాండి క్రాఫ్ట్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళా లో విజయ్ ఈ చీరను ప్రదర్శించగా సమ్మిట్ లో పాల్గొన్న వ్యాపార వేత్తలు ఆసక్తి గా తిలకించారు. చీర వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# రికార్డు స్థాయిలో పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

లిమిటెడ్ రూ.9 వేల కోట్ల పెట్టుబడులకు హామీ ఇచ్చింది. పెద్ద స్థాయి డేటా సెంటర్ల నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపింది.. దీంతో సుమారు 2 వేల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది.ఏజీపీ గ్రూప్ మొత్తం రూ.6,750 కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. బయోలాజికల్ ఈ లిమిటెడ్ (బీఈ) టీకాలు, పరిశోధన అండ్ అభివృద్ధి, తయారీ సేవల విస్తరణలో భాగంగా రూ.3,500 కోట్ల కొత్త పెట్టుబడులను ప్రకటించింది. గత పెట్టుబడితో కలిపి మొత్తం రూ.4,000 కోట్లు అవుతుంది. దీంతో 3 వేలకు పైగా ఉద్యోగాలు రాబోతున్నాయని అంచనా వేసింది.

ఫెర్టిస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ రూ.2 వేల కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అధునాతన ఆహారం, వ్యవసాయ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేయనుంది. దీంతో 800 పైగా ఉద్యోగ అవకాశాలు రానున్నాయని ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. స్థిర వ్యవసాయానికి అవసరమైన పోషకాలు, బయో ఉత్ప్రేరకాలు తయారీకి రూ.200 కోట్ల పెట్టుబడి ప్రతిపాదించారు. వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ లిమిటెడ్ ఫ్రీజ్ అండ్ డ్రైడ్ కాఫీ ప్లాంట్ స్థాపనకు రూ.1,100 కోట్ల పెట్టుబడితో యూనిట్ ఏర్పాటు చేయడానికి ముందుకు వచ్చింది. దీని ద్వారా వెయ్యి మంది వరకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్టు తెలిపింది.

రిలయన్స్ కన్స్యూమర్ ప్రోడక్ట్స్ లిమిటెడ్ రూ.1,500 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయబోయే యూనిట్ ద్వారా 1000 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఎలక్ట్రానిక్ తయారీ సేవల విస్తరణలో కేన్స్ టెక్నాలజీ ఇండియా లిమిటెడ్ రూ.1,000 కోట్లకు పైగా పెట్టుబడి ప్రతిపాదించింది. ఆర్సీ సీటీ ఎనర్జీ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ మూడు విడతల్లో రూ.2,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. దీంతో 1,600 కి పైగా ఉద్యోగాలు లభించనున్నాయి. పర్వ్యా గ్రూప్ 50 మెగావాట్ల సామర్థ్యం గల గ్లోబల్ కెపాసిటీ, ఏఐ ఆధారిత డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా 3 వేల మందికి ఉపాధి వచ్చే అవకాశం ఉంది.

అరబిందో ఫార్మా రూ.2,000 కోట్లతో విస్తరణ చేపట్టి 3వేలకి పైగా ఉద్యోగాలు సృష్టించనున్నట్టు ఆ సంస్థ ప్రభుత్వానికి తెలిపింది. హెటెరో సంస్థ మందుల తయారీ యూనిట్ల విస్తరణకు రూ.1,800 కోట్ల పెట్టుబడి ప్రకటించింది. దీంతో 9 వేలకి పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలకు అవకాశం ఉందని అంచనా వేసింది. గ్రాన్యూల్స్ ఇండియా రూ.1,200 కోట్ల పెట్టుబడితో 2,500–3000 మందికి ఉపాధి కల్పించనుంది. భారత్ బయోటెక్ రూ.1,000 కోట్ల పెట్టుబడితో పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవల కోసం ఆధునిక కేంద్రం ఏర్పాటు చేస్తోంది. దీంతో 200లకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉంది.

ఆహార, పానీయాల తయారీ విస్తరణలో కేజేఎస్ ఇండియా రూ.650 కోట్ల పెట్టుబడికి ముందుకొచ్చింది. ఈ యూనిట్ ద్వారా 1,551 మందికి ఉపాధి లభించనుందని అంచనా. గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ రాష్ట్రంలో పాల ఉత్పత్తి విస్తరణకు రూ.150 కోట్ల పెట్టుబడితో 5 లక్షల లీటర్ల సామర్థ్యం గల యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ యూనిట్ ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు రానున్నాయి. ఆక్వెలాన్ నెక్సస్ లిమిటెడ్ తెలంగాణలో క్లీన్ ఎనర్జీ ఆధారంగా 50 మెగావాట్ల నెట్ జీరో ఉద్గారాల డేటా సెంటర్ ఏర్పాటు చేస్తోంది.

# జీపీ మొదటి ఫేజ్ ఎన్నికలకు సన్నద్ధం..

(మొదటి పేజీ తరువాయి)

ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల విధుల్లో పీఓలు 898 మంది, ఓపీఓలు 1,135 మంది ఉన్నారు.

ఓటరు జాబితాలో పేరు ఉండి ఓటరు గుర్తింపు కార్డు లేకున్నా.. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఓటరు జాబితాలో పేరుండి.. ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) కాకుండా ఈ క్రింద చూపిన 18 ప్రత్యామ్నాయ ఫొటో ఐడీలలో దేనినైనా ఒకటి పోలింగ్ సిబ్బందికి చూపి తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

ఆధార్, భారతీయ పాస్ పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, పీఎస్ యూలు, పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలు జారీ చేసిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, బ్యాంకు, తపాలా కార్యాలయం జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ బుక్, పాన్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్(ఎన్‌పిఐ) కింద రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సెస్ కమిషనర్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, శాసనసభ, శాసనమండలి జారీ చేసిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అధికారిక గుర్తింపు కార్డులు, ఫోటోతో కూడిన స్వాతంత్ర్య సమరయోధుల గుర్తింపు కార్డు, లోక్ సభ, రాజ్యసభ జారీ చేసిన ఎంపీ గుర్తింపు కార్డు, ఎన్నికల నోటిఫికేషన్ కంటే ముందు జారీ చేసిన ఫోటోలతో కూడిన ఉపాధి హామీ జాబ్ కార్డు, కేంద్ర కార్మికశాఖ జారీచేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డ్, రేషన్ కార్డు, ఎస్సీ, ఎస్టీ, బీసీ ధ్రువపత్రాలు, పెన్షన్ పత్రాలు, ఆయుధాల లైసెన్స్, దివ్యాంగ ధృవీకరణ పత్రం, పట్టాదారు పాస్ బుక్.

## సంక్రాంతికి 'నారి నారి నడుమ మురారి'

**బలగం టీవీ, హైదరాబాద్**




శర్వానంద్ నటిస్తున్న ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'నారి నారి నడుమ మురారి' ఈ సంక్రాంతికి విడుదల కానుంది. దర్శకుడు రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ చిత్రాన్ని ఎకె ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటిస్తున్నారు. మేకర్స్ మంగళవారం విడుదల చేసిన పోస్టర్‌లో చిత్రం జనవరి 14న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు ప్రకటించారు. ప్రత్యేకత ఏంటంటే ఈ సినిమా ప్రీమియర్ షోను సాయంత్రం 5:49 గంటలకు ప్రారంభించనున్నట్టు తెలిపారు. సాధారణంగా ఉదయం లేదా తెల్లవారుజామునే షోలు మొదలయ్యే నేపథ్యంలో ఈసారి మేకర్స్ ప్రత్యేక ముహూర్తాన్ని ఎంచుకోవడం ఆసక్తికరంగా నిలిచింది. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో రూపొందుతున్న ఈ చిత్రం పూర్తి స్థాయి ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఉండనున్నట్టు యూనిట్ సభ్యులు తెలిపారు. విడుదల పోస్టర్‌లో శర్వానంద్ పూల హారంతో స్టైలిష్ లుక్‌లో కనిపించగా, సంయుక్త గంభీరంగా, సాక్షి వైద్య ఆహ్లాదకరమైన చిరునవ్వుతో ఆకట్టుకున్నారు.

# తొలి టీ20లో భారత్ భళా

- **ఆదుకున్న హార్దిక్ పాండే**
- **175 పరుగులు చేసిన భారత్**
- **74 పరుగులకే కుప్పకూలిన సౌతాఫ్రికా**




**బలగం టీవీ, కటక్**

దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో భారత్ దుమ్మురేపింది. టాస్ కోల్పోయి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 175 పరుగులు చేసింది. అనంతరం ఛేదనలో ప్రోటియాస్ కేవలం 74 పరుగులకే ఆలౌట్ కావడంతో భారత్ 101 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. అంతర్జాతీయ టీ20ల్లో సౌతాఫ్రికా ఎదుర్కొన్న ఇదే అతి తక్కువ స్కోరు. పిచ్‌పై తేమ, అనిశ్చిత బౌన్స్ కారణంగా భారత టాప్‌ఆర్డర్ తొలి నుంచే కష్టాల్లో పడింది. శుభ్మన్ గిల్, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ లుంగి ఎన్గిడి బౌలింగ్‌కు త్వరగా బల య్యారు. తర్వాతి బ్యాటర్లు కూడా పెద్దగా రాణించలేదు. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, అక్షర్ పటేల్ కలిసి 53 బంతుల్లో 49 పరుగులకే పరిమితమయ్యారు.

**ఆదుకున్న పాండ్యా**

78/4తో భారత్ కష్టాల్లో ఉన్న వేళ హార్దిక్ పాండ్యా అద్భుత ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పూర్తిగా మార్చేశాడు. కేశవ్ మహారాజ్ ఓవర్లో వరుస సిక్సులు, నోకియా బంతులను బౌండరీలకు పంపుతూ రన్‌రేట్‌ను పైకి లేపాడు. చివరి ఓవర్లలో దూకుడైన షాట్లతో భారత్‌ను గౌరవప్రద స్కోరు దిశగా నడిపించాడు. 28 బంతుల్లో 59 పరుగులు (6 ఫోర్లు, 4 సిక్సులు)తో నాటౌట్‌గా నిలిచిన హార్దిక్ ఇన్నింగ్స్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ధరించింది.

**భారత బౌలర్ల ధాటికి కుప్పకూలిన దక్షిణాఫ్రికా**

176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా ఆరంభం నుంచే ఒత్తిడిలో పడింది. అర్ష్‌దీప్ సింగ్ తొలి ఓవర్లోనే డీకాక్‌ను సున్నా పరుగుల వద్ద పెవిలియన్‌కు పంపాడు. తన రెండో ఓవర్లో స్టబ్స్‌ను ఔట్ చేస్తూ భారత్‌కు ఊపునిచ్చాడు. బ్రెవిస్ (22), మార్క్రమ్ (14) మాత్రమే కొంత ప్రతిఘటించారు. అయితే భారత పేసర్ల, స్పిన్నర్ల సమన్వయంతో మిగిలిన బ్యాటర్లు నిలువలేకపోయారు. 12.3 ఓవర్లలోనే 74 పరుగులకు ఆలౌట్ అయ్యారు. బుమ్రా తన 100వ టీ20 వికెట్‌ను నమోదు చేయడం ఈ మ్యాచ్‌కు ప్రత్యేక ఆకర్షణ. చివరి వికెట్‌ను శివం దూబే తీసుకొని భారత భారీ విజయాన్ని ఖరారు చేశాడు.

# పేదల అభ్యున్నతే లక్ష్యంగా విజన్ డాక్యుమెంట్

(మొదటి పేజీ తరువాయి)

తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ తొలుత విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడున్న ప్రముఖ యూనివర్సిటీలు, ప్రముఖ ప్రాజెక్టులను ఏర్పాటు చేశారని వివరించారు. అదే దారితో తమ ప్రభుత్వం కూడా విద్య, ఇరిగేషన్‌తో పాటు కమ్యూనికేషన్ రంగానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని తమ ప్రభుత్వం గుర్తించిందన్నారు. చైనా, జపాన్, కొరియా, సింగపూర్ దేశాల్లో అభివృద్ధే తమకు రోల్‌మోడల్ అని చెప్పారు. ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. భారతీయుల ఆయు ప్రమాణం 73 ఏండ్లు ఉన్నదంటే దానికి నెహ్రూ తీసుకొచ్చిన విధానాలే కారణమని గర్వంగా చెప్పారు. తనకు 11 ఏండ్ల ప్రాయంలో పెద్ద యాక్సిడెంట్ జరిగిందనీ, ఉస్మానియా ఆస్పత్రిలో ట్రీట్‌మెంట్ తీసుకున్నానని చెప్పారు. అలాంటి ఆస్పత్రులను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించే లక్ష్యంతో ముందుకు సాగుతామని తెలిపారు. నేటికీ గ్రామాల్లో ప్రజలు వివక్షా రూపాలను ఎదుర్కొంటున్నారనీ, కొందరిని దేవాలయాల్లోకి కూడా రానివ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం నుంచి జాతి వివక్షను దూరం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. దళితులకు, ఆదివాసీలకు, మైనార్టీలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లు వేర్వేరుగా ఉండటం, ఆ పిల్లల్లో తాము వేరు అనే భావన ముద్ర పడేలా చేయడం సరికాదనే ఉద్దేశ్యంతోనే వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూపకల్పన చేశామన్నారు. 140 కోట్ల ప్రజానీకమున్న మన దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క గోల్డ్‌మెడల్ కూడా రాకపోవడం లోటేననీ, దానికోసమే ప్రత్యేక క్రీడా పాలసీ రూపొందించామన్నారు. దీర్ఘకాలిక లక్ష్యాలతో విజన్ డాక్యుమెంట్‌కు రూపకల్పన చేశామన్నారు.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాంరాజన్ మాట్లాడుతూ హెల్త్, ఎడ్యుకేషన్, స్కిల్ మీద కేంద్రకరించి పనిచేయడం గొప్ప విషయమన్నారు. దేశంలో పట్టణీకరణతో పాటు, ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతున్నాయని చెప్పారు.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు మాట్లాడుతూ గతంలో ఐకాన్ సిటీగా బెంగుళూరు ఉండేదనీ, ఇప్పుడు ఆ స్థానాన్ని హైదరాబాద్ వేగంగా ఆక్రమిస్తోందని తెలిపారు. నిరుద్యోగం నిర్మూలనపై ప్రభుత్వం ఫోకస్ పెట్టి పనిచేస్తున్నదన్నారు. ఏటా 8 నుంచి 9 శాతం వృద్ధి రేటు సాధిస్తే పదేండ్ల తర్వాత తెలంగాణ మోడల్ అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ విజన్ డాక్యుమెంట్‌పై ప్రతి ప్యానెల్ విభిన్న ఆలోచనలను తమతో పంచుకున్నదని తెలిపారు. పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు కలిపితేనే ఉత్పాదకత వుతుందనీ, ఆ దిశగా తమ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించుకున్నదని వివరించారు.

ప్రముఖ సినీ నటుడు చిరంజీవి మాట్లాడుతూ హైదరాబాద్‌ను గ్లోబల్ ఫిల్మ్‌హబ్‌గా మార్చాలనే ఆలోచనను సీఎం తనతో పంచుకున్నారని తెలిపారు. అన్ని దేశాల నటులు ఇక్కడకు వచ్చి షూటింగ్‌లు చేయించాలనే ఆలోచన రావడం గొప్ప విషయమనీ, హైదరాబాద్ నగరంలో విభిన్న వాతావరణ పరిస్థితులు, వనరులు ఉన్నాయని తెలిపారు. సినిమా హబ్‌గా తెలంగాణను మార్చేందుకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామనీ, దీనికోసం ప్రత్యేకంగా ఓ సదస్సు ఏర్పాటు చేయాలని కోరారు.

నిటి అయోగ్ వైస్ చైర్మెన్ సుమన్‌బెర్రి మాట్లాడుతూ తెలంగాణలో మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయనీ, దాన్ని ఆధారం చేసుకొని ఉత్పాదకతపై ఫోకస్ పెట్టాలన్నారు. నిటి ఆయోగ్ లక్ష్యాలకు అనుగుణంగా తెలంగాణ విజన్ ఉందని ప్రశంసించారు. వైద్యం, విద్య విషయంలో రోడ్‌మ్యాప్ వేసుకోవడం గొప్ప విషయమని ప్రసంసించారు.

# భారత్ ఫ్యూచర్ సిటీతో లక్షల ఉద్యోగాలు

(మొదటి పేజీ తరువాయి)

సంతరించుకుంటుందన్నారు. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రిక్ వాహనాలు, పరిశోధనలు, మ్యాన్యుఫ్యాక్చరింగ్‌కు ఇది కేంద్రబిందువవుతుందని వివరించారు.

**ఆరు అర్బన్ జిల్లాలు ఆరు ప్రధాన రంగాలు**

భారత్ ఫ్యూచర్ సిటీని ఆరు ప్రత్యేక జిల్లాలుగా అభివృద్ధి చేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. అవి

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ జిల్లా
హెల్త్ సిటీ
ఎంటర్టైన్‌మెంట్ జిల్లా
క్రీడల జిల్లా
డేటా సెంటర్ల జిల్లా
అంతర్జాతీయ ఉన్నత విద్యా జిల్లా

ఇక్కడ ఏర్పడే పరిశోధనా సంస్థలు, గ్రీన్ ఫార్మా, మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఎంటర్టైన్‌మెంట్ జోన్లు కలిసి సుమారు 13 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తాయని చెప్పారు. అలాగే 9 లక్షల జనాభా కోసం భారీ స్థాయిలో వసతి సముదాయాలు నిర్మించనున్నట్టు తెలిపారు.డేటా సెంటర్ల కోసం 400 ఎకరాలను కేటాయించనున్నట్టు మంత్రి తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కన్వెన్షన్ సెంటర్లు, అడ్వెంచర్ జోన్లు, స్టార్ హోటళ్లతో ఎంటర్టైన్‌మెంట్ జిల్లా అభివృద్ధి కానుంది. అదే విధంగా, రిలయన్స్ ఫౌండేషన్‌తో ఒప్పందం కుదుర్చుకుని వన్ తారా వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఫ్యూచర్ సిటీ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు.మరో నెల రోజుల్లో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. భవిష్యత్ నైపుణ్యాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దే ఈ విశ్వవిద్యాలయం నగర అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.